

పలివేటి నాగచంద్రావతి

ఆ చిన్న డాబాముందుకు వచ్చి రిక్షా ఆగింది. డాబా ఇంటికి ఆనుకుని వున్న పెంకుటింటి కిటికీలోనుంచి మూడుజతల కళ్లు రెప్పవాల్చక అతికుతూహలంగా అటువైపే చూచాయి.

ముందుగా రిక్షాదిగిన రవి శ్రీదేవికి చెయ్యందించాడు. సిగ్గుపడుతూ రవి కళ్లలోకి చూసి, అలవోకగా ఆ చెయ్యందుకొని రిక్షా దిగింది శ్రీదేవి.

భర్త చేతిని అలాగే అదిమి పట్టుకుని నడవాలనుకొన్న శ్రీదేవి కిటికీ వెనకాల చేరి పులుకూ పులుకూ తమనే పరికిస్తోన్న ఆ కళ్ళ తాలూకు ఆకారాల్ని గమనించి చటుక్కున రవి చేతిని వదిలేసి, బిడియపడుతో భుజంమీదికి చెంగులాక్కుంది.

రవి గేటు తలుపు తీసుకొని చకచక డాబా ఇంటిని సమీపించాడు. తాళంతీసి తలుపులు బార్లా తెరిచాడు. ఆమైన ఒక్కడుగు పక్కకువేసి క్రీగంట భార్యను చూస్తూ కళ్ళతోనే సంజ్ఞ చేశాడు.

ముద్దరాలిలా భర్త ననుసరించి వచ్చిన శ్రీదేవి కుడికాలు ముందుకివేసి గృహప్రవేశం చేసింది.

దృశ్యం ఆనేంతమేరలో చూపులకింక ఆహారం దొరకదని రూఢీ అయ్యాక కిటికీ ముందునించి వెనక్కి మళ్ళిన సరాంచమ్మ, 'కొత్త బిచ్చగాళ్ళలా ఉన్నారు' అన్నది స్వగతంలా.

'ఇంతోటి రంభా మరెక్కడా దొరకదన్నట్టు, ఆ పీచుజుట్టు పెళ్లాన్ని చూసుకుని ఏం మురిసిపోతున్నాడో! చెయ్యట్టుకు మరీ దించాలి గావును ఆ నగాడిని' అన్నది భాగ్యం ఏడ్డేవగా. ఆ అమ్మాయి కళ్లలో

అసూయ కొట్టొచ్చినట్టు అగుపడుతోంది.

భాగ్యానికి తనకంటే అందంగా ఉన్న ఏ ఆడపిల్లను చూసినా జలసీయే. అది కప్పి పుచ్చి, వాళ్ల అందచందాలలో లేని లోపాలు వెంచుతో అతి చులకనగా తీసేసి మాట్లాడి, తనని తాను మభ్య పెట్టుకుంటూ వుంటుంది.

వరాలమ్మ పెద్దకూతురు భాగ్యం; రెండోకూతురు రత్నం. రత్నం కంఠస్వరం ఎల్లవేళలా తారస్థాయిలోనే మోగుతూ ఉంటుంది కాని ఇటువంటి సీక్రెట్ సందర్భాలలోమాత్రం బాటరీ పవరు తగ్గిన రేడియోలా తన గొంతు వాల్యూమ్‌ని విచిత్రంగా తగ్గించేస్తూ వుంటుంది.

'అక్కా అతను అచ్చం రాజేష్‌ఖన్నాలా ఉన్నాడు గదే?' భాగ్యం చెవిదగ్గరచేరి రహస్యంగా గుసగుస లాడింది రత్నం.

రత్నం ఏ సినిమా చూసొచ్చినా ఆ మర్నాడు వయసులోవున్న ప్రతి మగాడిలోనూ ఆ హీరో రూపురేఖలూ, ఆ కథానాయకుడి లక్షణాలూ పోల్చుకోడం పరిపాటి.

క్రిందటిరోజు వాళ్లక్కతో కలిసి, 'మర్యాద' హిందీ సినిమా చూసివచ్చింది రత్నం. రాత్రంతా ఆ పిల్ల కలల్లో రాజేష్ ఖన్నాయే నిండిపోయాడు.

'ఆ— నీ మొహం...' చప్పరించేసింది భాగ్యం. 'నుదుటిమీద దుబ్బుజుట్టు పడినవాళ్ళందరూరాజేష్‌ఖన్నాలాగే కనిపిస్తారు నీకు...నయం... అతగాడి పెళ్ళాన్ని పట్టుకుని సయిరాబానులా ఉన్నదన్నావు కాదు' అన్నది వెటకారంగా.

ఇక తగ్గిపోయింది రత్నం. అక్కగారి అభిప్రాయాలపట్ల అమితమైన అభిమానం ఉన్నది రత్నానికి. తనకో స్వంత అభిరుచిగానీ, అలవాటుగానీ వుండాలనుకోదు రత్నం. ఎంతసేపూ భాగ్యానికి పక్కతాళం వేస్తూ అక్కగారి ఆదేశాలను అక్షరాలా అమలుపరుస్తూ వుంటుంది.

ఇలా ముగ్గురూ మూడువిధాల డాబా ఇంట్లో కొత్తగా దిగిన యువజంటమీద వ్యాఖ్యానాలు సాగించి అప్పటికి తృప్తి పడ్డారు.

* * *

తెల్లతెల్లవారింది ఇంకా పూర్తి మెలుకువ రాక మూసుకుపోతున్న కనురెప్పల్ని బలవంతాన తెరిచింది శ్రీదేవి. కిటికి ఆవల రేకులు విడుతోన్న తెల్లగులాబీ ఉల్లాసంగా ఊగులాడుతూ ఆహ్లాదంగా ఆహ్వానించింది ఆమెను.

క్షణంలో బద్ధకాన్ని విదిలించేసుకుని కిటికీదగ్గర వాలింది శ్రీదేవి

బాలభాస్కరుని నునులేత కిరణాలు కొబ్బరి ఆకులమీద బంగారుమలామా పూస్తున్నాయి.

నందివర్ధనం పూలపై మంచుబిందువులు బొట్లుబొట్లుగా నిలిచి అవి అతి పవిత్రంగా, అతి స్వచ్ఛంగాకనిపిస్తున్నాయి.

విరబూసిన జినియాలూ, గుత్తులు గుత్తులుగా లిల్లీలూ తమతమ వర్ణ విశేషాలతో చూపుల నాకట్టుకొంటున్నాయి.

ఆ చల్లటి సుప్రభాత సమయాన, రాత్రి గడిచి, నిద్రవదిలి కనులు విప్పిన తొలిక్షణాన ప్రకృతి చిత్రించిన ఆ కళాఖండాల్ని చూస్తుంటే అంతుతెలియని ఆనందానుభూతి ఏదో ఆవరించి పరవశించి పోయింది శ్రీదేవి.

అప్పుడే మేలుకొన్న రవి మెల్లగా భార్య చెంతకుజేరి, చల్లగా భుజంమీద చెయ్యివేసి, సుతిమెత్తగా నొక్కాడు.

భర్త చేతిమీద తనచేతినివేసి, ఆప్యాయంగా మందహాసం చేస్తూ, 'ఆ పువ్వులు చూడండి ఎంతబావున్నాయో!' అన్నది శ్రీదేవి సంభ్రమంగా.

పగడాలరంగులోఉన్న శ్రీదేవి పెదవులనీ, నిర్మలంగా మెరిసే ఆమె కళ్లలోని అమాయకతనీ తన్మయంగా చూస్తూ, 'ఊ' అన్నాడు రవి మెత్తగా.

'నాకు తెల్లగులాబీలంటే బోలెడిష్టం; మరి మీకో?' అన్నది శ్రీదేవి గోముగా.

'ఉహూం ... నాకు తెల్లగులాబీలంటే వాటిని ముడుచుకొన్న నీ నల్లని జడయిష్టం' మురిపెంగా అని శ్రీదేవి భుజాలచుట్టూ చేతులు బిగించబోతున్న రవి ఎవరో అడ్డగించినట్టు తటాలున ఆగాడు.

సందేహంగా తలతిప్పి కిటికీవైపు చూసింది శ్రీదేవి. నాలుగా ఓ దొంగమాపు విసిరి ఏమీ ఎరగనట్టు జారుకుంటున్న రత్నం ఓ వెకిలినవ్వు నవ్వింది.

'ఏమిటీ మేళమని' చిరాకుపడి కిటికీ కర్టెను నిండుగా లాగబోతూ కెవ్వున కేక పెట్టి సుడిగాలిలా బయటకు పరుగెత్తింది శ్రీదేవి.

అప్పటికే చిటారుకొమ్మనఉన్న తెల్ల గులాబీని ఆకులతోసహా కోసేసింది భాగ్యం. లిల్లీలనీ, జినియాలనీ టపటపా మొరటుగా తెంపేస్తోంది రత్నం.

కొంప మునిగినట్టు తల్లడిల్లిపోతో పరిగెత్తుకొచ్చిన శ్రీదేవివంక వింతగానూ, నిర్లక్ష్యంగానూ చూశారా అక్కచెల్లెళ్ళు.

ఘడియక్రితం సర్వాభరణ సుందరిలా, అలంకరించుకొన్న నవమోహనాంగిలా కనిపించిన ఆ పెరడు ఇప్పుడు రాజలాంఛనాలు కోల్పోయిన మహారాజులా దిగులుగా బోసిగా వెలావెలాపోతోంది.

ఏడుపొచ్చినంతపనయింది శ్రీదేవికి. వారిద్దరిమీదా వల్లమాలిన కోపమూ ముంచెత్తుకొచ్చింది. కానీ తన వయసువారూ, పొరుగువారూ, అంతకుమించి కొత్తవారూ అయిన ఆ కన్నెలతో దూకుడుగా వ్యవహరించటం తగినపనిగా అనిపించలేదు.

అదీకాక శ్రీదేవి రెండుపదులు నిండని లేతప్రాయపు పడుచు; తొలిసారిగా నిన్ననే గృహిణీత్వపు హోదాలో ఆ ఇంట్లో అడుగుపెట్టిన కోమలాంగి. 'నా' అనీ, 'నాది' అనీ అనుకోగలిగే ఈ పదవిలో, తన స్వాధికారపు హద్దులు ఏవో, ఎంతవరకూ చెలాయించవచ్చో, కూడదో అనే మీమాంస తేలలేదు ఓ పట్టాన. అందువల్లకూడా కొంత జంకూగొంకూ కలిగేయి. అంచేత తన ఆగ్రహాన్ని చాలావరకూ తమాయించుకొన్నది. అయితే పూర్తి కోపాన్ని ఆపుకోడం, తనని కానట్టు పట్టించుకోకుండా వుండిపోడం కూడా ఆమెకు తలకుమించిన పదే అయింది.

'ఎవరినడిగి కోశారా పువ్వులు? అయ్యయ్యో ఒక్క పువ్వు కూడా లేకుండా తెంపేశారు కద...!' కంఠంలో సాధ్యమయినంత కరుకు తగ్గించి బాధగా అన్నది శ్రీదేవి.

భాగ్యం నుదురు చిట్లించింది. 'ఎవరినడగాలీ...? ఈ మొక్కలన్నీ మావే.' ధిక్కారంగా అన్నది భాగ్యం. స్వల్పంగా కూడా బెరుకు లేదా పిల్లలో.

'మీవా? అదెలాగ? మా ఇంటిముందున్న స్థలంలో ఉన్నాయి కదా యివి?' ఆశ్చ

# స్వయంకృతం

ర్యంతో శ్రీదేవి కళ్ళు పెద్దవయ్యాయి.

ఈమారు రత్నం సమాధానం చెప్పింది. 'ఇంతకుముందు ఈ ఇంట్లో ఉండి వెళ్ళిన తాసిల్దారుగారి భార్య పెట్టింది మొక్కల్ని. వాళ్ళు వెళ్ళిపోతూ మా కప్పగించిపోయారు వీటిని.' అధికారం మా హస్తగతమయి వుండగా మధ్య నీ ప్రమేయం ఏమిటన్నట్టు మొహం పెట్టి, ఎంతకీ తునగక ఇబ్బంది పెడుతోన్న నూరు వరహాల గుత్తిని గట్టిగా పట్టుకొని కసిగా నులిపెట్టసాగింది రత్నం.

నిస్త్రాణ పడిపోయింది శ్రీదేవి. కళ్ళకు విందులు చేస్తోన్న ఈ సుందర సుకుమార సుమాలన్నీ పరాయొకరి సొత్తని తెలిసేసరికి వదనాదుల్లోకి విరసం పాకిపోయింది.

ఇప్పుడామెకు వాళ్ళిద్దరూ పువ్వులు కోసుకుంటున్న పోటీ ఆడపిల్లలుగా కాక పీకలు నులుముతున్న కటికవాళ్ళలా కనిపించారు.

మొగ్గలతో సహితం కోసుకుని, 'నీతో మాకేమి'టన్నట్టు తిరస్కారంగా శ్రీదేవి వైపు ఓ చూపు విసిరి విజయగర్వంతో నడిచిపోతున్నది భాగ్యం. ఆ అమ్మాయి చేతిలో లేత నీలంరంగు ప్లాస్టిక్ పువ్వుల బుట్ట వూగులాడుతోంది. ఆ బుట్టలో రంగు రంగుల పువ్వుల మధ్య చెలికత్తెల నడుమ వెలిగిపోయే చిన్నారి రాకుమారిలా తెల్ల గులాబీ నన్నే చూడమన్నట్టు మిడిసి పడుతోంది.

నిట్టూర్చింది శ్రీదేవి. 'స్...స్నానం చేశాక తెల్ల జరీ చీర కట్టుకుని, తెల్ల గులాబీ పెట్టుకుని...కాఫీ గ్లాసు పట్టుకొని...భర్త దగ్గరకు వెళ్ళి...అబ్బ—!' గులాబీ ముట్టి ఎన్ని మధురోహలు కల్పించుకొన్నది తను.

పోనీ దేవిరించే అయినా, అభిమానం చంపుకుని ఆ ఒక్క గులాబీ పువ్వూ యివ్వమని అడుగుదామని పెదవులదాకా వచ్చిన వాక్యాన్నే దిగమింగి ఊరుకున్నది.

కళ్ళె విరిచినట్టున్న వారి మాటలూ, చూపులూ, సంధికి సందివ్వకుండా వున్న వారి వైఖరీ గమనించి తన ప్రయత్నం విరమించి వెనక్కి తిరిగింది శ్రీదేవి.

'పెట్టి పోషించిన దానిలా ఎలా గదమాయించి అడుగుతోందో...హు! ఎలాగయితే నేం...డాబా ఇంట్లో దిగామని గర్వం' తిట్టిపోతో భాగ్యం చేసిన విసుర్ని మరుక్షణ తగిలింది శ్రీదేవికి.

అలా ఆదిలోనే అపశృతిగా మొదలయింది శ్రీదేవికి పొరుగువారి పరిచయం.

*

'కష్టానికయినా సుఖానికయినా ముందు ఆసరాపడేవాళ్ళు ఇరుగుపొరుగులేనమ్మా. ఆ తరవాత ఆదుకునేవారే బంధువులు. చుట్టుపక్కలవారితో సఖ్యతగా వుండు తల్లీ' అని కాపురానికి పంపిస్తూ బామ్మ చెప్పిన హితవు పదే పదే తలపుకొచ్చి, 'ముందు మాట జారి నేనే తప్పు చేశానేమో? ఇక ఏమంటూ వాళ్ళు నన్ను పలకరించబోతారు.' అనుకుంటూ ఆ తరవాత తెగ మధనపడ్డది శ్రీదేవి.

కానీ — సాయంత్రమే భాగ్యం తండ్రి వెంకట్రామయ్యా, తల్లి వరాలమ్మా నూతనంగా దిగిన దంపతులను పరామర్శించడానికి వచ్చేసి శ్రీదేవి పడుతోన్న ఆ కాస్త బెంగా తొలగించారు.

దిగులు తీరి తేలికపడ్డ మనసుతో శ్రీదేవి వినయంగా వారి నాహ్వానించి మర్యాద చేసింది. ఆ భార్యా భర్తలు వచ్చిన కొద్ది సేపటికే భాగ్యమూ, రత్నమూ కూడా వచ్చారు. వారి రాక మాత్రం శ్రీదేవికి విస్మయాన్ని కలిగించింది. కానీ అది బయట పెట్టక వారిని కూడా సంతోషంగా 'రండం'టూ పిలిచింది.

ముందు గదిలో వెంకట్రామయ్యగారు రవిని మాటల్లోకి దించారు. పడక గదికి ముందున్న హాలులో ఆడవాళ్ళు సమావేశమయ్యారు.

వరాలమ్మ మంచి మాటనేర్పరి. అంతే కాదు. అతి తెలివితేటలు చూపించే మనిషి. ఎంతసేపూ తన మాటల చమత్కారంతో ఎదుటివాళ్ళ గుట్టుమట్లు లాగుతుందే తప్ప తను లోగుట్టు ఓ పట్టాన బయట పెట్టదు.

శ్రీదేవి బి. యే. దాకా చదువుకున్నదనీ, రవికి రెండు డిగ్రీలూ—గెజెటెడ్ ఆఫీసర్ ర్యాంకుకి ఓ మెట్టు మాత్రమే దిగువన ఉన్న మంచి ఉద్యోగమూ కలవాడనిన్నీ, నెలకు పదివేలు అయివేజా వచ్చే స్థిరాస్తి ఉన్నవాడనీ —

హాలీవుడ్ నటుడి వంటి అంగసౌష్ఠవమూ ఖరీదయిన వరులకుండే ఇన్ని అర్హతలూ వున్న రవి, శ్రీదేవియొక్క గుణగణాలూ, అందచందాలూ, చదువు సంధ్యలే కట్నకానుకలుగా భావించి ఆమెను అర్ధాంగిగా స్వీకరించాడన్న సమాచారం కూర్చున్న అరగంటలో సేకరించి 'అదృష్టవంతురాలివి' అనబోయి మానుకున్నది వరాలమ్మ.

తన పిల్లల్ని తప్ప ఇతరులని మెచ్చుకొనే అలవాటు తప్పిపోయిందామెకి. తన కూతుళ్ళకి ఇలాగే, ఎప్పుడో ఒక సుముహూర్తాన ఏ మిలియనీరో వెతుక్కుంటూ వచ్చేసి ఎగరేసుకుపోతాడని గాఢమయిన నమ్మక మామెకు.

'దానికేముందిలే ఈ కాలం కుర్రాళ్ళు కంటికి నదురుగా ఆడపిల్ల కనబడాలే గానీ తెగ ఎగబడిపోతున్నారు. మా అమ్మాయికీ ఇలాగే లక్షాధికారల సమంధాలెన్నో కానీ కట్నమక్కరలేదంటూ వచ్చేయి.' 'నీ అదృష్టమొక లెక్కలోదా..' అన్నట్టు చేతులు తిప్పుతూ కొట్టిపారేసింది వరాలమ్మ.

'మరికనేం చేసెయ్యలేకపోయినారా ?' అందం ఆట్టే లేకపోయినా అలంకరణ అధికంగా వున్న భాగ్యంకేసి అమాయకంగా చూస్తూ అన్నది శ్రీదేవి.

'ఏదీ...మొన్ననే పదహారు వెళ్ళి పదిహేడో ఏడు వచ్చింది ఇంత పసిపిల్లని అప్పుడే సంసార ఝంఝాటంలో ఇరికించటమా అని తలాయిస్తున్నారు వాళ్ళ నాన్న; ఇది సరే, పెళ్ళి వద్దా — ఇంకా చదువుకుంటానని ఒకటే మోత. వచ్చిన సమంధాలొచ్చినట్టే వెనక్కి పోతున్నాయి' వరాలమ్మ తన కొక్కతికే ఆ విచారమన్నట్టు భారంగా నిట్టూర్చింది. ఆ నిట్టూర్పులో అదో విధమైన అహంకారం మిళితమై వుండటం శ్రీదేవికి తెలిసిపోతూనే వున్నది.

'ఆడపిల్లకి ఈడు వచ్చాక పెళ్ళయ్యే దాకా ఏళ్ళు ఇక ముందుకు నడవ్వు' అని బామ్మ హాస్యంగా అంటూ వుండేది

చిన్న పిల్లలా అగుపించడానికి భాగ్యం లంగా వోణీ వేసుకున్నది. కానీ ఇరవై దాటిన వయసు ముదరగ భాగ్యం మొహంలో కొట్టొచ్చినట్టు కనబడిపోతూనే వుంది.

'పసిపిల్ల' అని చెబుతోన్న ఆ తల్లి దొసరికానికి లోలోపలే నవ్వుకున్నది శ్రీదేవి.

వీళ్ళు మాటల హడావిడిలో వీళ్ళు వుండగా భాగ్యమూ, రత్నమూ కలిపి

ఇల్లంతా చుట్ట బెట్టి వచ్చారు.

వారికి బెడ్‌రూంలో యూఫోమ్ బెడ్సూ, డన్‌లప్ దిళ్ళూ, డ్రెస్సింగ్ టేబిలూ మొదలు, కిచెన్ రూంలో డైనింగ్ టేబులూ, చిన్నసైజు ఫ్రిజ్ దయిరూ దాకా అన్నీ సరికొత్తవీ అధునాతనమైనవే కనిపించాయి వీట న్నిటికన్న ముఖ్యాకర్షణగా కనిపించిన వస్తువు బెడ్‌రూంలో స్టూల్ మీది ఫోటో ఆల్బమ్. అది శ్రీదేవీ రవిల హనీమూన్ ట్రిప్‌లో ఇద్దరూ కలిసి తీయించుకొన్న ఫోటోలు.

ఈ వస్తు సముదాయమంతా రత్నం కళ్ళకు వుత్సాహపూరితమయితే, భాగ్యం మనసుకి కళ్ళోల హేతువయింది.

'ఇవన్నీ తను కంటోన్న కలలు; వూహిం చుకొంటున్న వూహలు తన భవిష్యత్ జీవితపు వూహాసౌధాన్ని, తానెంతో శ్రమపడి నిర్మించు కొన్నదాన్ని హటాత్తుగా శ్రీదేవి ఆక్ర మించుకున్నట్లుగా అనిపిస్తోంది భాగ్యానికి.

కక్కాలేదు; మింగాలేదు శ్రీదేవిని ఏదో అని నొప్పించాలని, ఏదో చేసి కష్ట పెట్టాలనే మాత్సర్యం అప్పటినించే మొదలయింది.

*   *   *

ఆడవాళ్ళు ఆడినంత సులభంగా అబద్ధాన్నిగాని వాళ్ళు చెప్పకొనేటంత విపరీతంగా లేని గొప్పల్ని చాటుకోవటంగాని సాధారణంగా మగవాళ్ళు చెయ్యలేరు.

ఇటు వరాలమ్మ కూతురు పెళ్ళి తను కొక లెఖ్ఖ ప్రలంబోది కాదన్నట్లు మాటాడుతున్న సమయంలోనే అటు వెంకట్రామయ్య రవి దగ్గర తన కూతుళ్ళ పెళ్ళిళ్ళ సమస్య తనకెంత పీకకు వురిలా తయారయిందో వివరించాడు.

ముగ్గురాడ పిల్లలూ, ఇద్దరు మగ పిల్లలూ గల బహుకుటుంబీకుడాయన. చేస్తున్నది కూటికి సుద్దకి మాత్రం తడుముకోనవసరం లేని గుమాస్తా గిరీ ఆ ఉద్యోగంలోనే తిమ్మిని బమ్మిని, బమ్మిని తిమ్మిని చేసి నాలుగురాళ్ళు వెనక వేశాడు.

గంతకు తగ్గ బొంతను చూసి ఆ మూడు ముళ్ళూ వేయిస్తే ఒకబారమన్నా వదుల్తుందని ఆయన తాపత్రయ మాయనది.

వరాలమ్మా భాగ్యమూ అది వదలివ్వరు. "నా పిల్లలు రత్నాలు; కో అంటే కోటి సమంధాలొచ్చి పడతాయ్ రెణ్ణాళ్ళు ఓపిక పట్టండి' అంటుంది వరాలమ్మ.

భాగ్యమయితే తన అందానికీ, తెలివి తేటలకీ ఏ పెద్ద ఆఫీసరో అయితే తప్ప తగదంటుంది.

వాళ్ళ కోరికలు చూస్తే ఈకాలపు దరవరల్లా ఆకాశమంటుతుంటాయి. తనా అంత పెద్ద సమంధాలకి తూగలేడు; ఆ తల్లీ కూతుళ్లలా ఎప్పుడో ఏదో హటాత్తుగా అద్భుతమేదో జరుగుతుందనే భ్రమలో పడలేడు; నేల విడిచి సాముచెయ్యలేడు.

భాగ్యం స్కూల్ ఫైనల్ మొదటిసారి ఫేలయి, రెండు మార్చిలూ, రెండు సెప్టెంబర్లూ డింకీలు కొట్టి ఆఖరికి స్కూల్ ఫైనల్ క్లాస్ ఎత్తేస్తోన్న సందర్భంలో అందర్నీ మూకుమ్మడిగా ప్యాస్ చేసేస్తున్న తరుణంలో గట్టెక్కిపోయింది.

## వాసంతహేల

దళదళమ్మున విరిసె
దరహాస రోచిస్సు
గళగళమ్మున మురిసె
క్రమగీతోషస్సు॥

మహిలోని సుమంతాలు
రహిమీర నలరారె!
మదిలోని భావనలు
కనలి పరుగులు వారె॥

కొమ్మెల్ల క్రొంగ్రొత్త
సొగసుతో విలసిల్లె!
జగమెల్ల మధురంత
మనసుతో వర్తిల్లె॥

గాయకుల గీతమందు
గానలహరులు చిలికె
భావుకుల యెదలందు
నవరసమ్ములు చిలికె॥

వాసంత సుమహేల
హసియించె శుభకళల,
ధీమంత హృదయాలు
దీపించె నవరుచుల॥

రా హోయి మిత్రవరా!
రమ్యజగతిని చూడ!
భావభరితమ్మైన
నవ గీతికను పాడ॥

—సురభి నరసింహము

అప్పటికే ఇరవై సంవత్సరాలు దాటాయి. ఏలాగూ చదువు అబ్బటం లేదుకదా అని మానిపించారు. పెళ్ళి చేద్దామని రెండేళ్ళ బట్టి ప్రయత్నిస్తున్నా వారి అత్యాశల మూలాన్ని ఒక్క సమంధమూ ఒనగూడ టం లేదు.

భాగ్యం ఈ ఏడాది కాలేజీలో చేరతానని మరో ఉత్పాతం లేవదీస్తోంది. బాగా చదువు కున్న పిల్లయితే పెళ్ళికాని అబ్బాయిలకు మోజెక్కువని వరాలమ్మా 'సై'అంటోంది.

భాగ్యం తరవాత రత్నం; ఆ పిల్లా టెన్తు ప్యాసయి తల్లికి పనిలో సాయ పడుతూ ఇంట్లోనే వుంటోంది. ఆతరవాత మగపిల్లవాడు ఈ ఏడాదే టెన్తులోకి వచ్చాడు ఆ పిల్లడి తరవాత మళ్ళీ ఆడ పిల్ల సెవెన్తు క్లాసు చదువుతోంది. ఆఖరి కుర్రాడు ఇంకా ఎలిమెంటరీ స్కూలు దాటలేదు. వీళ్ళందరినీ ఎప్పటికి ఓ ఒడ్డుకు చేర్చుతానా అని దుమికి పోతున్నాడా మానవుడు!

ఇదీ ఆయన కుటుంబ భాగవతం వినే వాళ్ళు దొరికిందే చాలని అన్నీ ఏకరువు పెట్టాడాయన. చివరికి 'మీ ఎరికలో అను వయిన సమంధముంటే చెప్ప నాయనా' అని ముగించాడు.

రవి, పెద్దవాడన్న గౌరవంతో ఆయన చెప్పినవన్నీ ఆదరంగా విన్నాడు. తప్ప కుండా తన చేతనయిన సాయం చేస్తానని హామీకూడా ఇచ్చాడు.

భోజనాలవేళ పిలిచిందంటూ ఆ భార్యా భర్తలు పిల్లలతోసహా అటు వెళ్ళాక శ్రీదేవి, రవి తర్కంలో పడ్డారు.

వరాలమ్మా, వెంకట్రామయ్యా వేర్వేరు ధోరణులలో నడిపిన సంభాషణలని సమ న్వయ పరుచుకోడంలో కొద్దిగా తికమక పడి ఆఖర్ని వారిద్దరి దృక్పథాలూ బోధ పడ్డాక చాలాసేపు నవ్వుకున్నారు.

ఆ మర్నాడూ భాగ్యమే పువ్వులు కోసుకు పోడాని కొచ్చింది. నిన్న తను ఇంటికి వచ్చిన చనువును పురస్కరించుకొని తెల్ల గులాబీమాత్రం తనకు మిగల్చమని ప్రాధేయ పడింది శ్రీదేవి

భాగ్యం ఏమాత్రమ ఒప్పుకోలేదు.

తనకూ అవే యిష్టమని ఖచ్చితంగా చెప్పేసింది. చిన్నబోయిన శ్రీదేవి వదనాన్ని చూసి ఏదో సాధించినట్టు సంతోషించింది భాగ్యం.

ఈ ఒక్క విషయంలోనే కాదు. శ్రీదేవిని ఇరుకున పెట్టగల ప్రతి దానిలోనూ మొండితనంతో 'నీకూ నాకూ పోటీ' అన్నట్టు వ్యవహరిస్తోంది భాగ్యం.

ఆ పిల్లతో నాకేమిటనుకోడానికి వీల్లేక పోతోంది శ్రీదేవికి. అది సాధ్యంకాదు కూడాను.

వచ్చిన చిక్కేమిటంటే వీరిరువురి ఇళ్ళూ ఒకే యజమానివి. ఒకే ఆవరణలో ఒక దానిపక్క ఒకటి కట్టాడాయన. ఎప్పుడో ఆ పెంకుటిల్లు కూడా డాబావేసి రెండిళ్ళూ కలిపెయ్యాలని ఆయన ప్లాను. రెండు ఇళ్ళకీ కలిపి ఒకే కుళాయి ఒకే బాత్ రూమూ ఉన్నాయి.

మరో బాత్‌రూమ్ త్వరలోనే కట్టిస్తానని ఇంటి యజమాని వాగ్దానం చెయ్యటం వల్లా, అంతకంటే మంచి ఇల్లు ఆ చిన్న వూర్లో దొరక్క తప్పనిసరిగా ఆ ఇల్లే కుదుర్చుకున్నాడు రవి.

అదే ఇప్పుడు భాగ్యం పథకాలకి వీలు కలిగిస్తోంది; శ్రీదేవికి ముక్కుట్టుకుంటోంది. తెల్లవారనివ్వదు — కుళాయిదగ్గర ప్రత్యక్షమయిపోతుంది బిందె వెనక బిందె నింపుతూ శ్రీదేవిని కాని వారి పనిమనిషిని కాని చెంబుడు నీళ్ళు పట్టుకోనివ్వదు

'ఇదేమిటంటే', 'ఎప్పటినించో వుంటున్నవాళ్ళం ముందు మాదే వంతు'ంటుంది. అసలలా అడిగినా దు మరి రెచ్చిపోయి పంతం కొద్దీ బిందెత్తుకెళ్ళి తూములో పారబోసి మళ్ళీ బిందట్టుకొచ్చేది కూడాను.

అనుభవం లేని శ్రీదేవి ఆ బిందిపక్కకి నెట్టి తను పట్టుకోలేదు; గట్టిగా గొంతెత్తి గద్దించా లేదు, పైగా అలా చెయ్యటం అలగాజనం చేసే పనుకుంటుంది.

ఇక ఇంటో పిల్లల చుక్కంటూ లేకపోయిన క్షణాన, శ్రీదేవి ఓపిక హరాయించుకు పోతున్న సమయాన, వరాలమ్మ దయతలచి బయటకొచ్చి 'పోనీలే అమ్మాంగా ఒక్క బిందె పట్టుకోనివ్వ' అంటుంది ఉదారంగా; ఎంతో ఉపకారం చేస్తూన్న దానిలా.

కుళాయి యుద్ధం ముగిశాక బాత్ రూమ్ దగ్గర సమరం మొదలు:

శ్రీదేవికి ప్రొద్దునే స్నానంచేసి పూజ చేసుకోవటం అలవాటు. ఈ పనులు ఉదయం ఏడు గంటల్లోపల తెముల్చుకుని కాఫీ తాగెయ్యాలి. లేకుంటే తలనెప్పి వచ్చేస్తుంది. అదో శాపమామెకు.

అదెలా కనిపెడుతుందోగాని సరిగ్గా శ్రీదేవి స్నానానికి వచ్చే వేళకు ఒక్కయిదు నిముషాలు ముందుగా తానూ స్నానానికి సిద్ధమయిపోతుంది భాగ్యం. కూనిరాగాలు తీస్తూ, అపశృతులతో వచ్చీరాని సినిమా పాటలన్నీ పాడకుంటూ పక్కా అరగంటగ్గానీ జలకాలాడ్డం ముగించదు.

అంతేనా—? తనదవగానే రత్నాన్నీ, రత్నం తరవాత చిన్న చెల్లెల్నీ ... ఇట్లా వరసాగ్గా అందర్నీ గొలుసుకట్టుగా స్నానాల గదిలోకి తరిమేస్తుంది.

చొరవగా దూసుకుపోలేని శ్రీదేవి బేలగా చూస్తూ వుంటుందంతే! ఏడుగంటలు ఇట్టే దాటిపోతాయి. ఎనిమిది మీదికి చిన్నముల్లు జరజర పాకిపోతూ వుంటుంది. దానికంటే వేగంగా శ్రీదేవి తలనెప్పి పెరిగిపోతూ వుంటుంది. తలబద్దలయి సొమ్మసిల్లే స్థితి వచ్చేస్తున్నట్టుంటుంది.


ప్రాణం కడబట్టే వేళకి ఆపద్బాంధవులల్లే వరాలమ్మో లేక వెంకట్రామయ్యగారో ఆమె అవస్థని కనిపెట్టి కలగజేసుకుంటే తప్ప శ్రీదేవికి ఆ హింసనుండి విడుదల కాదు; శ్రీదేవి వంటిగ్గానీ స్నానానికి గానీ ముక్తీ మోక్షమూ లభించదు.

వరాలమ్మ మహా గడుసు. ఆవిడెప్పుడూ తన పిల్లల్నే వెనకేసుకు వచ్చేది. ఇన్ని తిప్పలు పెడుతోన్నా కూతుర్నెప్పుడూ గట్టిగా మందలించి ఎరగదు. చూసీ చూడనట్టు ప్రవర్తించేది. ఎదురు తన ముద్దుల కూతుళ్ళ బారినుండి శ్రీదేవిని రక్షించిన ప్రతి తడవా, 'మేము కాబట్టే ఇంత ఔదార్యం చూపిస్తున్నాం' అన్నట్టు మాట్లాడేది.

అసలు శ్రీదేవి ఇంటిముందున్న పూదోటని తమ స్వంతం చేసుకొన్న చతురతా, నీళ్ళకు గూడా వంతులేసిన చాకచక్యమూ తన అతి తెలివి తేటలతో కూతుళ్ళకు నేర్పి పెట్టింది ఆవిడే. ఆ పిల్లల ఆకతాయితనం హద్దుమీరటానిక్కారణంగూడా తల్లి వత్తాసి చూసుకునే.

సూత్రధారి తనయినా ఆ విషయం బయటపడనిచ్చేది కాదు తెలివిగా. వెనగ్గా తన పిల్లల చేష్టలని ఎగసన దోస్తూ, ముందుకొచ్చి శ్రీదేవిని ఆదుకొని పెద్ద మనిషిలా నటించేది. అదేమి తరహానో మరి !

ఎంతకీ సేవకురాలయిన శ్రీదేవిని తమ చేతికింద నొక్కివుంచాలనే తాపత్రయం తప్ప, అటువంటి పెంపకంలో పెరిగిన పిల్లలు తమ భావి జీవితంలో అదే మూర్ఖత్వం మూలంగా ఎని ఇక్కట్ల




దీర్ఘ రోగులకు
ఉత్తమ వైద్యము
నపుంసకత్వము, శుక్ల నష్టము, హస్తప్రయోగము, అసంతృప్తి, ఉబ్బసం (దమ్ము), బోదకాళ్లు, చెవుడు, కడుపునొప్పి, కుష్ఠు, బొల్లి, చర్మ వ్యాధులకు పోస్టులు ద్వారా కూడా వైద్యము చేయబడును.
శ్రీ బాలాజీ వైద్యశాల. డా. వి. కుమారస్వామి.
బోస్ రోడ్, తెనాలి. ఫోన్: 551
బ్రాంచి 9—డి, శివాజీ స్ట్రీట్, మద్రాసు—17

35 సం॥ అనుభవం
వరిబీజము బుడ్డలు బీజకుట్లు మొదలగు వ్యాధులకు ఆపరేషన్ లేకుండా గ్యారంటీగా బాగుచేయబడును
రా అండ్ క్రా ఆసుపత్రి
గౌలిగూడ నయబస్ డిపో ఎదురుగా, రామ్‌మందిర్ రోడ్, హైదరాబాద్-12 ఆ.ప్ర.
ఆఫీసు ఫోన్: 42870 ఇంటి ఫోన్: 38544

సరసమైన ధరకి వస్త్రాలు?

ట్విన్ టస్కర్
డ్రిల్‌లు·పాప్లిన్‌లు·గాబర్డీన్‌లు టస్సూర్‌లు మొదలైనవి
మధుర మిల్స్
మధురై, దక్షిణ ఇండియా
Bensons-1841 A TEL


# స్వయంకృతం

పాలయేదీ తమచుట్టూ వున్న వారి జీవితాన్ని కూడా ఎంత నరకం చేసేదీ బహుశా ఊహించి వుండదావిడ.

ఇంత హైరానా పడుతోన్నా భర్తతో చెప్పుకోవాలన్న యోచనే కలగలేదు శ్రీదేవికి. చిన్న చిన్న విషయాలు ఆడవాళ్లే సరిపెట్టుకోవాలి గానీ, దండిచేసి మగవాళ్లదాకా తీసుకువెళ్లటం అసహ్యమైన పనని ఆమె ఉద్దేశ్యం.

కానీ శ్రీదేవి చెప్పకుండానే రవికి గూడా భాగ్యం చేస్తున్న కొంటెచేష్టలు చూచాయగా, లీలగా అవగతమనుతూనే ఉన్నాయి గానీ అంతగా పట్టించుకునేవాడు కాదు, ఆ వ్యవహారం ఆ స్థితిని దాటి అతని ఎట్టఎదుటే నిలిచింది.

అదెలాగునంటే—

వూరికే కూర్చునేకంటే ఓ వ్యాపకమంటూ ఉంటే మంచిదేనని కూతురితో రాజీకొచ్చి భాగ్యాన్ని కాలేజీలో చేర్పించాడు వెంకటామయ్య.

దానితో ఇహ ఆ పిల్లకు పట్టపగ్గాల్లేకుండా పోయాయి. అసలే సింగారమెక్కువ. ఇప్పుడది వెర్రితలలు కూడా వేస్తోంది.

నుదుట రింగుల్లా పడేలా జుట్టు కత్తిరించి వేజులైనుతో అతికిస్తోంది. చెంపల దగ్గర ఒక పాయ వెంట్రుకల్ని గాలికి వదిలేస్తుంది. 'ఐబో పెన్సిల్'తో డ్రాయింగ్ గీసినట్టు కంటిరెప్పల్ని నల్లన చేస్తోంది. అతి జాగ్రత్తగా బుగ్గలకి రోజ్ పౌడరూ, పెదవులకి లిప్‌స్టిక్కూ అద్దుతుంది. టైట్‌గా బొడ్డు కిందికి చీర కడుతుంది. వెనకా ముందూ బాగా మెడ దిగిపోయిన చేతుల్లేని బ్రాసియర్ జాకెట్ తొడుగుతూంది. గుండెల ఎత్తు కనబడేలా ఒంటిపొర పమిట వేస్తుంది. ఆ పమిటయినా మూరెడుండి భుజం చివర నుండి ఏ క్షణాన్నయినా జారిపోతానంటూ ఉంటుంది.

గంటల తరబడి చేసుకొనే ఈ మేకప్పంతా కాలేజీ చదువుకేనట పాపం!

ఆమె ఎప్పి పోకిళ్ళుపోయినా ఎవరికీ అభ్యంతరం లేదుగానీ ఆ ఆకారంతో మొక్కల్ని పరీక్షచేసే నెపంమీదా, వాట్లకి నీళ్ళుపోసే మిషమీదా, వరండాలో పేపరు చదువుకొనే రవి ముందునించీ చిన్ని చిన్ని అడుగులు వేస్తూ వయ్యారాలు గుప్పిస్తూ పదిసార్లు తిరిగేది.

పిల్లగారితో తియ్యని కబుర్లు చెప్పుకుందామనే అభిలాషతో సాయంత్రం పూట డాబామీదికి చేరిన శ్రీదేవికీ రవికీ ఆ ఒంటరితనం మిగలనీకుండా, అదే అదనులో పుస్తక మొకటి హస్తభూషణంగా తీసుకుని పైకి చేరుకునేది.

పెరట్లో స్నానానికో మరో పనికో రవి రావటాన్ని చూసిందంటే సరి— తనూ ఏదో పనున్నట్టు పెరట్లోనే తచ్చాడేది. 'ఆ డర్టీ నీళ్ళు ఇంకా కాగనే లేదా అమ్మా కాలేజీకి టైమయిపోతోందే' అంటూనో, 'కూంచ్ ఒకసారిటిచ్చి వెళ్లవేరత్నా కాలేజికి వేళయిపోతూంది.' అనో, 'నైన్ గంటలయిపోయింది ఇంకా వంట వనే లేదా అమ్మా నేను కాలేజీకి వెళ్ళాలని తెలీదా?' అని అడుగుతూనో హంగామా చేస్తూండేది.

ఆ పద ప్రయోగా లెంత వికృతంగా ఉన్నయ్యో ఆ అమ్మాయికయితే తెలియ లేదు గానీ, వింటూన్న రవికి అవి వెగటుగా వుండేవి 'ఈవిడ కాలేజీ చదువు వెలగబెడుతూందని చాటుకునేందుకు సంపూర్ణంగా ఏ బాషకీ చెందని ఈ పేడి ముక్కలు నిదర్శనాలు కాబోలు' అనుకుని ముసిముసిగా నవ్వుకునేవాడు.

అతని చిరునవ్వులని అపార్థం చేసుకొన్న శ్రీదేవికి ఆగ్రహం అదుపులో ఉండననేది ఎన్నయినా ఓర్చుకున్నది గానీ ఈ దురాగతాన్ని మాత్రం సహించలేకపోయింది శ్రీదేవి.

ఎంతయినా ఆడ హృదయం కదా! తన నాథుడికి ఎర చూపి వల విసిరే మరొకతె నీడనయినా భరించగలదా ?

రవితో భాగ్యం ఆగడాలు తొలినుండీ తువివరకూ వర్ణించి చెప్పి; ఈ ఇంట్లోంచి వెళ్ళిపోదామంటూ అని గునిసింది శ్రీదేవి.

రవి తేలిగ్గా నవ్వాడు 'ఓస్ ఈ మాత్రం దానికి బంగారమంటి ఇల్లు వదులుకుని పారిపోవటమా ? ఇంపాజిబుల్' అన్నాడు

'మరయితే ఆ అమ్మాయి నన్ను ముప్పు

తిప్పలూ పెడుతూంటే విప్పాళ్ళు పడి వుండమంటారు?' ఉక్రోషంగా అన్నది శ్రీదేవి.

రోషంతో ముక్కుపుటాలు పెద్దవయి ఎర్రగా కందిపోయిన భార్య మొహం రవికి నవ్వు తెప్పించింది. కాని అప్పుడు నవ్వితే ఎంత ప్రమాదమో తెలుసునతనికి. బలవంతాన పెదవులు బిగించి రాబోయే నవ్వు నాపుకున్నాడు రవి.

'అది కాదు శ్రీ...ఆ అమ్మాయికి నిన్ను కవ్వించే వీలు, మనసే అందనివ్వకుండా వుంటే సరి. తనని రెచ్చగొట్టే వాళ్లే ఎవరూ లేకపోతే కొన్నాళ్ళు చూసి ఆ అమ్మాయంతట ఆ అమ్మాయే బుద్ధి తెచ్చుకుని ఇటు పోలికి రావటం మానుకుంటుంది. అలాంటివారికి సరయిన మందు అదే.' అనునయంగా నచ్చజెప్పబోయాడు రవి.

'అదెలాగు? నీళ్ళు పట్టుకోటం మానెయ్యమంటారా? స్నానం చెయ్యడం మానెయ్యమంటారా? అవి కూడా మీరే చెప్పండి' రెట్టించింది శ్రీదేవి వ్యంగ్యంగా.

'ఏముందీ..కుళాయి దగ్గర భాగ్యం ఉన్నప్పుడు పనిమనిషితో బయటనించి రెండు బిందెల నీళ్ళు తెప్పించుకో. బాత్‌రూమ్ ఖాళీ లేనప్పుడు వంటయింటి తూము దగ్గరే స్నానం చేసేయ్...' ఉపాయాలు పోటెత్తే భార్య తనని అడిగినట్టు వెనుకాడకుండా చెప్పేశాడు రవి.

శ్రీదేవికి మండుకొచ్చింది ఇక ఉండబట్టలేక తను దేనికయ్యి నిజంగా అలజడి పడుతున్నదో చెప్పుకొచ్చేసింది. 'అవును నేను గతిలేనట్టుగా బయటనించి నీళ్ళు తెప్పించుకుంటాను, ఇంట్లోనే స్నానమూ చేస్తాను; ఆ పిల్ల మాత్రం మహారాణీ సాహెబ్‌లా టాయిలెట్, నాకిలీ, డాబా అన్నీ ఆ రెండింటినీ అనుభవిస్తూ వుంటుంది. పోంగా ఇంకా పొగ్గా అలంకారం చేసుకొని మీ ఎదుట కళ్ళ కింపుగా పచార్లు చేస్తూ వుంటుంది' శ్రీదేవి కంఠం అప్పటికే రుద్ధమయిపోయింది.

రవి కలవరపడ్డాడు. 'శ్రీ నేను ఆ అమ్మాయి కోరి వేషాలకే చలించిపోతానను కుంటున్నావా?' అన్నాడు శ్రీదేవి చుబుకం ఎత్తి కళ్ళలోకి చూస్తూ.

శ్రీదేవి సిగ్గుతో కనురెప్పల్ని వాల్చుకున్నది. సందేహంగానే తల కొద్దిగా అడ్డంగా వూపింది.

'లేదు కానీ బురదగొడ్డుకి విషం లేదని తెలిసినా పామన్నా ఎదురుతో దూరంగా పోమా? నా భయం నాది' అన్నది గద్గదికంగా.

భర్త నిజాయితీని శంకించటం లేదు శ్రీదేవి. కానీ ఆ పాపిష్టిపిల్ల భాగ్యం... తన కాపురానికే నీళ్ళు తోడాలని చూస్తున్నదే ఏం చెయ్యటం?

ఎంత నిగ్రహవంతుడయినా 'వనిత తనంత తా వలచి వచ్చిన...' ముక్కు మూసుకు తపసు చేసుకొనే మహామహా మహర్షులంతటివాళ్ళే కాలుజారి తప్పటడుగులు వేశారని కావ్యాలు చెబుతున్నాయే... ఉప్పూ, పులుపూ తింటున్న తన భర్త అనగా ఎంత? ఈయనేం ప్రవరాఖ్యుడా? అపర శ్రీరామచంద్రుడా?

శ్రీదేవి సంశయాన్ని మబ్బుగమ్మినట్టున్న ఆమె మొహంలోనే చదువుకున్నాడు రవి.

జాలిగా నిట్టూర్చి, 'నా నైతిక విలువల మీద నీకింత అవిశ్వాసమున్నదని ఇప్పుడే తెలుసుకున్నాను శ్రీ... మనస్సు దృఢంగా ఉండాలే గానీ ఇంతకుమించిన వన్నెలొలికిన కన్నెల్ని ఇంటా బయటా చాలమందినే చూశాను'

'సరే ఈ పాడ విచారాలు మనకెందుకు... మరో ఇల్లు త్వరలోనే చూసుకుందాంలే' అన్నాడు గంభీరంగా.

కంగారుపడింది శ్రీదేవి. 'కుళ్ళుకంపులకు లోనయిన తన మనస్సు నతడు పసిగట్టాడు.'


'అబ్బే. మీ మీద నాకు...నాకు నమ్మకం లేక కాదు...' అంటూ గబగబాడుతో ఏదో సద్దుకోబోయింది.

రవి ఆమె ఆందోళన అర్థం చేసుకున్నాడు. 'నిన్నగాక మొన్న తన జీవితంలో అడుగెట్టిన ఈమెకు తన గుణాల్ని అంచనా వెయ్యగల వ్యవధి ఏదీ?' ఈ ఊహతో శ్రీదేవిపట్ల అతనికి ఆర్ద్రత కలిగింది.

ఆమెనిక మాట్లాడనివ్వలేదు రవి. దగ్గరగా హత్తుకుని ప్రేమగా తల నిమిరాడు. 'పిచ్చి శ్రీ...ఎన్నిరంగులేస్తే మాత్రం కాకి చిలుక అవుతుందా...? గోరింక దాని జతకడుతుందా? ఈ ముచ్చి బంగారాలన్నీ, నా స్వర్ణ ప్రతిమ... నా శ్రీ కాలిగోటికి పోటీ రానివని నీకు తెలియదూ?' అంటూ బుజ్జగించాడు.

ముందుముందు ఎలాగయినా మారాలి ఆ ఘడియలోమాత్రం శ్రీదేవి మనసులోవున్న అనుమానాలన్నీ పటాపంచలయిపోయాయి.

(ముగింపు పైవారం)



# పెద్దకథ:

(గత సంచిక తరువాయి)

'మనిషిలోని క్రూరత్వాన్నీ, దానవతనూ పెంపొందింపచేసే ఏ లక్షణాన్నయినా సరే అసహ్యించుకోకూడదు. దానికి బదులు ఆ వ్యక్తి అంత నీచత్వానికి ఎందుకు ఒడిగట్టాడోనని సానుభూతిగా ఆలోచించాలి. సాధ్యమయితే దాని నివారణోపాయాలు వెతకాలి.' ఇది రవియొక్క సిద్ధాంతం.

భాగ్యం ప్రవర్తనను గూర్చి రవి నిశితంగా ఆలోచించాడు. 'భాగ్యం శ్రీదేవి ఎడల చూపిస్తున్న అక్కసుకు కారణం ఈర్ష్య. ఆ విషయం బట్టబయలుగా తెలిసి పోతూనేవున్నది. ఇక వివాహితుడనని తెలిసీ తనపై బరిసించే శృంగార వీక్షణాల కేమిటి అర్థం?

ఏవో వక్రమార్గాన బాధ్యతలు నెత్తిన పడితే తప్ప తన వరునిగూర్చి పసిడికలలు కనే కన్నెవయసులో ఉన్నది భాగ్యం. కాకపోతే ఆ స్వప్నాల బరువు సగటు బరువు కంటే మరింత అధికంగా ఉన్నదంటే అది చెయ్యరాని అపరాధపు జాబితాలోది కాకపోవచ్చు; కానీ అందని చందమామని ఆశించినప్పుడు, అది అందని పక్షంలో, 'ఆ ద్రాక్షలు పుల్లన లెమ్మని ఓదార్చుకో గలిగే స్థయిర్యం ఉండాలి. ఆ నిబ్బరం ఆ అమ్మాయిలో వున్నదా అని.'

అప్పుడే తనని ఆకర్షించాలని చూడ్డం వంటి తప్పటడుగులు వేస్తూందే... ముమ్ముందు ఆమె ఏ దారుణాలకి దారి తీస్తుందో?

'ఈ గోల నాకేల!' అని వేరే ఇల్లు చూసుకోవటమా — లేదా భాగ్యం కలలు తీరటంలో సాయంచేసి ఆమెకా చెడు మార్గాన్నించి మరల్చి ఒక మంచిపని చేయటంలోగల నిండైన అనుభూతిని అందుకోవటమా?'

రవి తర్జన భర్జన పడ్డాడు.

మొదటిది సులభమే అయినా, వెంకట్రామయ్యగారితో సాన్నిహిత్యం పెరిగే కొద్దీ ఆయన మంచితనాన్ని కుటుంబపు చికాకుల్లో ఆయనపడే అవస్థ అర్థమై రెండవదానికే ప్రయత్నించి చూడాలని నిశ్చయించు కున్నాడు రవి.



ఎలివేటి నాగచంద్రావతి

అలా చేయడంవల్ల భాగ్యం ఏదో ఒకనాడు గతంలో తనెంత ఆకతాయితనంగా ప్రవర్తించేదో తలచుకొని తప్పకుండా పశ్చాత్తాప పడుతుందని అభిప్రాయ పడ్డాడతను.

* * *

చంద్రశేఖరం రవి ఆప్తమిత్రుల్లో ఒకడు. ఇద్దరూ ఒకేసారి డిగ్రీలు తీసుకున్న కాలం మాత్రం అతన్నీ మధ్యనే కటాక్షించింది. బొంబాయిలో ఓ కంపెనీలో ఉన్నతోద్యోగి అయినాడిప్పుడు.

పొంగల్‌కి ఇంటికి వెడుతో, దారిలో మజిలీగా మీ ఇంట్లో మకాం వేస్తానని ఉత్తరం రాశాడతను.

స్నేహితుని ఆగమనవార్త రవికి ఉత్సాహాన్నీ, సంతోషాన్నీ కలిగించింది. అతని మనస్సులో మరో ఆలోచనగూడా సరికొత్త నక్షత్రంలా తళుక్కుమన్నదప్పుడే

'శేఖరానికింకా వివాహం కాలేదు. చదువుకొనే రోజుల్లో ఆదర్శాలూ గట్రా అంటో చర్చలు జరిపే సందర్భాలలో తనలాగే వరకట్నాలమీద తీవ్ర నిరసన వెలిబుచ్చేవాడు శేఖరం. తాము చేపట్టే కన్య అందచందాలకీ చదువు సంధ్యలకీ ప్రాముఖ్య మివ్వాలని నిర్ణయించు కున్నారప్పట్లో ఇద్దరూనూ.

ఆ ఆశయాలింకా అతనిలో నడలి పోకుండా ఉన్నట్లయితే భాగ్యాన్ని చూసుకో

కుని నేలో ఇవ్వాలను కున్నాడు రవి.

'శేఖరం మంచి అందగాడు; భాగ్యానికి తప్పక నచ్చుతాడనటంలో సందేహం లేదు. ఆస్తిపాస్తులు గూడా ఏ మాత్రమో ఉన్నట్టే జ్ఞాపకం. ఆస్తిమాటెలా వున్నా శేఖరం చేస్తున్న ఉద్యోగం ఘనమైనది. జీపూ, నౌకరూ, బంగళావంటి క్వార్టరూ ...ఇన్ని హంగులూ, హోదాగల ఆఫీసరతను. శేఖరం ఒప్పుకుంటే భాగ్యం జీవితం సుఖమయ మవుతుంది.

భాగ్యన్ని చూసి శేఖరం ఇష్టపడాలే కాని కట్నకానుకల ప్రసక్తి లేకుండా తను అతన్ని ఒప్పించి 'ఊ' అనిపించగలడు; తనకా ధీమా వున్నది.'

తనలో మెదిలిన ఈ ఉద్దేశ్యాలను కార్యరూపం ధరిస్తేతప్ప ఎవరిదగ్గరా బహిర్గతం చెయ్యదలచలేదు రవి.

'ముందస్తుగా తొందరపడి వెంకట్రామయ్యగారికి తెలియపరిస్తే, పెళ్లి చూపులనీ, అదనీ — ఇదనీ, ఆర్బాటం చెయ్యక మానరు. ఆ తతంగానికి బోలెడు ఖర్చూ ప్రయాసా అవుతాయి. తీరాచేసి శేఖరం కంటికి భాగ్యం ఆనకపోతే అనవసరంగా వారికి ఆశ రేపి అంటిలోనే తుంచినవాడవుతాడు. అంచేత వెంకట్రామయ్యగారికి తెలియనివ్వలేదు.

అసలే భాగ్యమంటే నిప్పుమీద ఉప్పల్లే చిటపట లాడుతున్న శ్రీదేవి దగ్గర ఈ విషయం చెప్పడం మరీ ప్రమాదం తన ఆలోచనకు అడ్డుపుల్లలు వెయ్యడమేకాక, 'ఆ అమ్మాయి వివాహ విషయంలో తన కింత శ్రద్ధ, ఆసక్తీ ఏమిటి'ని తనమీద అనుమానం పొరికాస్త బలపడే అవకాశం గూడా ఉన్నది.

శేఖరం రావాలి; అతడు పెండ్లికి సుముఖంగా, కట్నానికి విముఖంగా వుండాలి; పరోక్షంగా భాగ్యాన్నతనికి చూపించి అతని అంగీకారం పొందాలి; అప్పటిదాకా బయట పెట్టక పోవటమే ఉత్తమ మనుకున్నాడు రవి. అందువలన ఆ వ్యూహాన్ని కేవలం తనలోనే గుప్తంగా ఉంచుకున్నాడు రవి.

* * *

శేఖరం వచ్చేరోజు రవి ఆఫీసుకి శెలవు పెట్టాడు. భార్యాభర్తలిద్దరూ స్టేషన్‌కి వెళ్లి శేఖర్ని వెంటబెట్టుకుని వచ్చారు.

# స్వయంకృతం

ఇంటిముందు టాక్సీ ఆగిన శబ్దం వినగానే అలవాటుప్రకారం కిటికీదగ్గర చేరిపోయారు భాగ్యం, రత్నమూను.

టాక్సీదిగి రుమాలుతో మొహం అద్దుకుంటూ పరిసరాలను పరిశీలిస్తున్న శేఖరం వారిద్దరూ తననే గుచ్చిగుచ్చి చూస్తూ ఉండటం గమనించి మొహమాటంగా తల తిప్పుకున్నాడు.

స్నానాలూ భోజనాలూ వగైరాలు పూర్తిచేసుకుని విశ్రమించాడు శేఖరం. సాయంత్రం ఏటివడ్డుకి షికారు వెళ్లారు మిత్రులిద్దరూ.

వర్షాకాలంలో కొన్నిరోజులు మినహాయించి ఆ ఏటిలో ఎప్పుడూ నీళ్లుండవు. కానీ అరగజం లోతుగా ఇసుక తవ్వితే మండువేసంగిలో కూడా తియ్యటి చెలమనీళ్లు వూరుతాయి. అదీ ఆ ఏరుయొక్క విశేషం.

ఏటికి మధ్యగా తెల్లని, మెత్తని, బంగారు రజనువంటి ఇసుక మేటలు వేసింది. అక్కడిదాకా వెళ్లి రుమాళ్లు పరిచి చతికిల పడ్డారిద్దరూ.

పిల్లగాలులు పసివాడి మృదుహస్త స్పర్శలా శరీరానికి హాయి గొలుపుతున్నాయి. ఒడ్డుని ఆనుకుని ఉన్న కొబ్బరి జామా తోటల్లోంచి పలరకాల పక్షుల కిలకిలా రావాలు వివిధ వాద్య సమ్మేళనంలా వినబడుతోన్నాయి.

కాస్సేపు తమ ఉద్యోగపు గొడవలూ, దేశరాజకీయాలూ పిచ్చాపాటీగా ముచ్చటించుకున్నాక, తాను తలపెట్టిన కార్యానికి నాందీ ప్రస్తావనగా రవి శేఖర్ని కదిలేశాడు. 'నిరుద్యోగి అవతారం చాలించావు గదా మరి బ్రహ్మచర్యానికి గుడ్ బై ఎప్పుడు చెబుతావ్' అంటూ.

శేఖరం అందంగా నవ్వాడు 'నీకు దొరికిన ఛాన్సు నాకూ దొరికినప్పుడు.' అన్నాడు డొంకతిరుగుడుగా.

'అంటే?' సగం అర్థమయ్యీ నిర్ధారణకు అడిగాడు రవి.

'మా శ్రీదేవి చెల్లాయిలా చదువూ చక్కదనమూ ఒకచోట కూడుకున్న అమ్మాయి దొరికేదాకా...!' గుప్పిట్లో ఇసుక పారబోస్తూ అన్నాడు శేఖరం.

'దారిలోనే ఉన్నాడు కుర్రోడు' అనుకున్నాడు రవి.

'రూపవతులకూ, విద్యావతులకూ కొరతేం లేదు ఎటొచ్చీ పిల్లతోపాటు ముల్లె కూడా కావాలనుకోక పోతేనే సుమీ!' అన్నాడు రవి వాలుగా శేఖరం ముఖకవళికలని కనిపెడుతో.

ఒకచేతిలోని ఇసుకని మరోచేతిలో పోసుకుంటూ ఆటలాడుతున్న శేఖరం చటుక్కున ఆగి చురుక్కున రవివైపు చూశాడు. అంతలోనే ఏదో పసిగట్టిన వాడిలా చిలిపిగా నవ్వేశాడు.

'ఏమిటోయ్ పరిష వేస్తున్నట్టు నీ మాటలూ చూపులూనూ...! నీకు చెల్లెళ్లున్నట్టు నాకు గుర్తులేదే? ఎవరి కోసం ఈ డొంకతిరుగుడు వ్యవహారం?' కొంచెంగా కళ్లెగరేశాడు శేఖరం.

ఇక సూటిగా రంగంలోకి దిగాడు రవి.

'నాకు చెల్లెలేవుంటే నా యావదాస్తీ నీకు రాసిచ్చి అయినా నిన్ను నా బావగా చేసుకునివాణ్ణిగానీ...ముందు నాకు సరిగ్గా జవాబు చెప్పవోయ్! లోగడ వరకట్నాల మీద నీకున్న అభిప్రాయాలు ఇంతవరకూ నిలిచివున్నాయి?' నిలేసినట్టే అడిగాడు రవి.

'త్యాగధనుడివి నువ్వే అనుకుని పొంగి పోకు సుమీ...! కొన్నాళ్లు వేచిచూస్తే మాటల్లోనే కాక చేతలే చూద్దువుగాని' నవ్వుతూనే చురకలంటించాడు శేఖరం.

ఉపేసి పట్టించుకోలేదు రవి. లైన్ క్లియరయింది. ఇక భాగ్యం సంగతి చెప్పాలి 'ఎలా మొదలుపెట్టడమా?' అన్న ఆలోచనలో ఉన్నాడతను.

రవి తటపటాయింపు చూసి శేఖరమే మళ్లీ అన్నాడు నింపాదిగా, 'నీకు చెప్పక పోవటమేం... ఇప్పుడు పండగ సెలవులతో మా ఇంటికి వెళ్లేది అమ్మాయిల వేట కోసమే. ఇప్పటికే ముదిరిపోయానని మా అమ్మ అభియోగం. ఒరే రవీ! నీ దృష్టిలో ఎవరయినా ఉంటే నిస్సంకోచంగా చెప్పరా బాయ్! కన్యమీద తప్ప, కానుమీద లేశమయినా ఆశలేదు నాకు సరేనా.' హామీ ఇచ్చాడు శేఖరం.

సగం బరువు తీరింది రవికి. తేలిగ్గా నిట్టూర్చి, మరి చెప్పవేం?...మా ఇంటి పక్క ఇంట్లో వెంకట్రామయ్యగారనీ సబ్ కలెక్టరాఫీసులో యు. డి. సి. వాళ్ల అమ్మాయున్నది. చక్కగానే ఉంటుంది.

ఇంటర్ చదువుతోంది పిల్లలు గలవాడాయన, పైసా యివ్వలేడు. నీలాటి ఔదార్యవంతులకోసమే చూస్తున్నాడు

నాకాయనమీద సానుభూతి వుంది; గౌరవం వుంది; ఆయనకు సాయం చేయాలన్న తపన ఉంది అలాగని నిన్ను బలవంత పెట్టను. రేపు నీకాఅమ్మాయిని పరోక్షంగానే అనుకో... చూపిస్తాను. నీకు నచ్చితే అది వాళ్ళ అదృష్టమనుకుంటాను. ఒకవేళ నీకు నచ్చకపోయినా నష్టం లేదు. వాళ్ళకి నేను ప్రత్యక్షంగా ఆశ కల్పించలేదు గాబట్టి నాకంత బాధ కలుగదు. ఇదిరా సంగతి ఏమంటావు?' సవిస్తరంగా విప్పిచెప్పి అతని సమాధానంకోసం ఎదురు చూశాడు రవి.

శేఖరం, 'అలాగే లెమ్మని సంతృప్తి పరిచాడతన్ని.

ఆతరవాత వారి సంభాషణ మరో వైపుకి మరలి పోయింది.

* * *

మరునాడు క్రమం తప్పకుండా పువ్వులు కోసుకు పోడానికొచ్చిన భాగ్యాన్ని శ్రీదేవిని ఏమార్చి శేఖరానికి చూపించాడు రవి

సహజంగానే ఫేషన్లంటే మోజుపడే శేఖరాన్ని, సీతాకోకచిలుకమాస్తరుపుల్ మేకప్‌లో వున్న భాగ్యం సులభంగానే ఆకర్షించింది. ప్రసన్నంగా వున్న శేఖరం మొహంలో అతని పూర్ణాంగీకారాన్ని చదువుకున్న రవికి ఆరాటం తగ్గి ఆనందం కలిగింది.

పైకి వెల్లడించక పోయినా అతనికి మరో డిగ్రీ సంపాదించినంత సంబరంగా, అనుకోకుండా ప్రమోషనొచ్చినంత అపూర్వంగా వుంది

ఇక వెంకట్రామయ్యగారికి తెలియ పర్చడం, ఆయన కృతజ్ఞతాభినందన లందుకోవటమే తరవాయి...'

గాలిలో తేలిపోయే మహోత్సాహంతో వున్న రవి, దగ్గరలో ఉన్న కొల్లేటి సరస్సుకు పిక్‌నిక్‌కు వెడదామని శ్రీదేవి కోరటంతోటే ఒప్పేసుకున్నాడు.

రేపటి ప్రోగ్రామ్‌కి ఈరోజునించీ హడావిడి పడ్డం మొదలెట్టింది శ్రీదేవి. స్వీట్సూ, హాట్సూ నిలవ వుండేవి చేసి బాస్కెట్స్ సర్దింది. చీరకి మాచయ్యే బొట్టు ఏరి పెట్టుకున్నది. సరదాగా 'జాడా' వేసుకోవాలని ఎప్పుడో కొని మూలపారేసిన ముడిపిన్నులు వెతుక్కుంది. రవి మార్కెట్‌కి వెళ్ళేటప్పుడు పువ్వులు తెమ్మని ప్రత్యేకంగా నొక్కి చెప్పింది,

'పువ్వులెందుకు చెల్లాయ్! రేపు బోలెడు పువ్వులు మనవాకిట్లోనే పూస్తాయిగా?' ముగ్ధంలా ఒళ్ళు ముడుచుకొని వున్న గులాబీ మొగ్గల్ని చూచి అన్నాడు శేఖరం.

తక్షణం శ్రీదేవికి భాగ్యం జ్ఞాపక మొచ్చింది. మొహం మటమట లాడిస్తూ 'ఇవి మావి' అంటున్నట్లు నిపించింది.

భాగ్యాన్నిగురించి పరుషంగా ఏదో అనబోయిందిగానీ అంతలోనే సభ్యతకాదని పించి తమాయించుకున్నది. 'బ్రతికి పోయాం' అనుకుని తేలిగ్గా ఊపిరి వదిలాడు రవి.

ఆ రోజు సాయంత్రం వరాలమ్మ బిందెతో నీళ్ళందిస్తూంటే, భాగ్యం మొక్కలకి పోస్తోంది.

డ్యూటీ పూర్తిచేసుకుని మరలిపోతున్న సూర్యభగవానుణ్ణి చూస్తూ వరండాలో జడ అల్లుకొంటున్నది శ్రీదేవి లోపల శేఖరమూ రవీ మూడుముక్కలాటలో మునిగివున్నారు.

మనస్సు మహా బలహీనమయినది. ఎన్ని ఎదురుదెబ్బలు తగిలినా ప్రలోభాని కది లొంగిపోతూనే వుంటుంది.

కళ్ళముందు ఎరుపు సొమ్ములాంటి పూదోట పూరిస్తోంది. గుబురుగా కొమ్మలతో, నిండుగా మొగ్గలతో, గుమ్మటంగా, సీమంతపు పడతిలా ఉన్న గులాబీమొక్కని చూసేసరికి మరోసారి రెపరెప లాడింది శ్రీదేవి హృదయం

జంకుతూనే వరాలమ్మని అర్థిస్తూ అడిగింది, 'పిన్నిగారూ, రేపు మేము పిక్‌నిక్‌కి వెడుతున్నాము రేపొక్కరోజూ నాకు గులాబీ పువ్వు లివ్వరూ...!' అని దేవుడి దర్శన మిప్పించమని పూజారిని వేడుకొనే భక్తురాలి మొరలాగ వుందామె స్వరం.

వరాలమ్మ ఏమనేదో గానీ ఆవిడకా ఎడమివ్వనేలేదు భాగ్యం. వెంటనే అందుకున్నది

'హయ్యో...! మీకూ రేపే కావాలా...? మా మేడమ్‌గారికి రేపు తెచ్చియిస్తానని ప్రామిస్ చేశానే...ఎలాగూ?' అన్నది 'గొప్ప సంకటంలో పడ్డట్టు మొహంపెట్టి.

శ్రీదేవికింకా ఆశ చావలేదు. 'రెండంటే రెండు చాలండీ సిగమీదికి సరిపోతాయీ!' అన్నది బ్రతిమలాడుతూ.

'అబ్బే—వీల్లేదండీ.' ఈసారి నిర్మొహమాటంగా చెప్పేసింది భాగ్యం.

ముందు ఊహించిందే అయినా శ్రీదేవి మనసు మళ్ళీ గాయపడింది. 'పెళుసు, దురుసుగా తప్ప, ఒక్కసారీ తనతో సౌమ్యంగా మాట్లాడదేం ఈ అమ్మాయి?'

మధ్యాహ్నం శ్రీదేవి తెచ్చియిచ్చిన



గులాబ్‌జామ్, మోహన్‌బాగ్‌ల రుచి ఇంకా మరుపుకు రాలేదో ఏమోగానీ, వరాలమ్మ కనికరించింది. 'ఎక్కడికో వెడలామంటోందిగా ... పోనీ ఒక్కటి ఇవ్వవే అమ్మాయ్' అని కూతురికి సిఫారసుచేసి, 'ఇస్తుంది లేవమ్మా' అని స్థిరపరిచేసింది.

మూతి ముడుచుకుని అయిష్టంగానే, 'ఊ'కొట్టింది భాగ్యం; 'తరించా' ననుకున్నది శ్రీదేవి.

* * *

ప్రతిరోజూ కంగారంతా రవిది. త్వరగా తెముల్చుకుని సిద్ధమవమని శ్రీదేవిని పదే పదే హెచ్చరిస్తున్నాడు.

శ్రీదేవి తొక్కిసలాడుతోంది. సమయం చూసి పనిమనిషి ఎగ్గొట్టింది. వంపు దగ్గర భాగ్యమూ బాత్‌రూమ్‌లో రత్నమూ బైఠాయించి ఒక్కపనీ కానివ్వడం లేదు. తనిక ఎంతతొందరపడీ ప్రయోజనమేమిటీ?

అప్పటికీ నోరుతెరచి 'నేను బస్సందుకోవాలి; పనిమనిషి రాలేదు! నాలుగు బిందెలు పట్టుకోనిస్తే చాలు ఎలాగో సర్దేసుకుంటాము' అని అడిగింది కూడానూ.

భాగ్యం ససేమి వినదే! 'నేనూ ప్రయివేటు క్లాసుకి వెళ్ళాలి. నేను నీళ్ళు పట్టుకుండాపోతే ఆనక అమ్మకు ఇబ్బంది' అన్నది మూతి ఓరా బిగించి.

శ్రీదేవికి కోపం ముంచుకొస్తోంది. మరొకప్పుడూ మరొకప్పుడూ అయితే భర్త ఉపదేశానుసారం సహనం చూపెట్టేదే. కానీ సమయమలాంటిది కాదయ్యె! వేళ మించిపోతున్నదే అన్న ఆదుర్దా ఒకపక్క, ఏమీ చెయ్యలేని నిస్సహాయత్వ మొకపక్కా పెనవేసుకుని శ్రీదేవికి కంపరమెత్తిస్తున్నాయి.

మింగేసేటట్టు భాగ్యాన్ని ఓసారి చూసి దరచరా ఇంట్లోకి నడిచింది శ్రీదేవి.

ఓపెన్ వరండాలో పేపరు చూడ్డానికని వచ్చిన వెంకట్రామయ్యగారితో 'మీకో శుభ వర్తమానం అందజెయ్యాలి. రేపు తప్పకుండా వస్తారు కదూ!' అంటున్నాడు రవి మందహాసంచిందే మొహంతో ఉత్సా[illegible]గా.

కట్టు తెంచుకున్న ప్రవాహమల్లె విసురుగా [illegible]న భార్యని చూసి ఆశ్చర్యంగా మాటలు [illegible] రవి. నూనెరాసి వేలు ముడివేసినజుట్టూ, పైకి దోపిన చీర కుచ్చెళ్ళూ...వంటింటి రణరంగంలోనించి తప్పించుకొచ్చినట్టున్న శ్రీదేవి ఆకారాన్ని చూస్తూ, 'ఇంకా ఇలాగే ఉన్నావేం శ్రీ...? ఎనిమిదిగంట అయిపోతున్నది తెలుసా? ఇలా అయితే వెళ్లేమే...!' అన్నాడు విసుగ్గా.

ఉద్రేకంలో విచక్షణా వివేకం గూడా నశిస్తాయేమో! వెంకట్రామయ్యగారు వున్నారనయినా వెనుకాడలేదు శ్రీదేవి.

'అహా... వెళ్ళేటట్లే వుంది. సర్దుకుపోవాలీ— సర్దుకుపోవాలీ అని నాకు నీతులు బోధిస్తారుగా— ఆ ముక్కవెళ్ళి ఆ భాగ్యానికీ, రత్నానికీ చెప్పండి చూద్దాం! గంటలు బ్రతిమలాడుతున్నా గోడకి చెప్పుకున్నవతు అయింది నా గోడు. పైగా ఇంట్లోకొస్తే 'ఇంకా కాలేదా?' అని మీ దబాయింపొకటీ మళ్ళీ' పడగళ్ళు కురిపించేసింది శ్రీదేవి.

తబ్బిబ్బయ్యాడు రవి. '[illegible] మాట్లాడు ఆ పెద్దాయనింకా ఉన్నాడు; ఏమనుకుంటాడు? ఎప్పుడూ లేనిది శ్రీదేవి ఇంత మూర్ఖంగా ప్రవర్తిస్తూందేం?' అనే భయం కూడా వున్నదతనికి. 'క్లీన్ చేయించుకోడానికి బయటకు వెళిన శేఖరం ఏక్షణాన్నయినా ఊడిపడొచ్చును. అతనిగ్గానీ భాగ్యంమీద నేనే ఈ దుమారం లేపిన దంటే...' కలవరపడ్డాడు రవి.

వెంకట్రామయ్యగారు ముందు తెల్లబోయారు. ఆ తరవాత కూతుళ్ల మొండిపట్టుదలకు నొచ్చుకున్నాడు. 'మరీ భాగ్యానికి పెంకితనం జరిసిపోతోం దమ్మా! అదంతా వాళ్ళమ్మ ఇస్తున్న అలుసు. దాని అడుగుజాడల్లోనే మిగతా పిల్లలూ చేరిపోతున్నారు' అని నిట్టూర్చి, 'పదమ్మా నేను చెబుతాను నీళ్ళు పట్టుకుందువుగాని.' అన్నాడాయన లేస్తూ.

ఆవేశం దిగజారి శాంతించింది శ్రీదేవి. అంతటితో ఆ రాద్ధాంతం సద్దుమణిగినందుకు రవి కూడా తెప్పరిల్లాడు.

శ్రీదేవి వదినే తనని కోప్పడటమే కాకుండా, స్వయంగా నిలబడి మరీ నీళ్ళిప్పిస్తున్నందుకు భాగ్యానికి తలవంపులయిపోయింది; లోలోపల ఈ పరాభవంతో కుత కుత లాడిపోయింది.

ఆ వేడిలో పూలసజ్జ పట్టుకుని భూమి అదిరేలా ధణ ధణా అడుగులువేస్తూ వెడుతోన్న భాగ్యాన్ని చూసి, 'నిన్న అన్ని ఆక్షేపణలూ అధిగమించి ఇస్తాననిపించుకోగలిగిన ఆ ఒక్క గులాబీ పువ్వుకీ ఈవేళ తిలోదకాలు వదులుకోవలిసిందే' అనుకుని నిట్టూర్చింది శ్రీదేవి.

అప్పుడే వచ్చిన శేఖరం స్నానానికి నీళ్ళు తోడి బాత్‌రూమ్‌లో పెట్టి, ఆశ పీడించగా త్వర త్వరగా వాకిట్లోకి వచ్చి నించుంది శ్రీదేవి.

అప్పలవాణ్ణి చూసినట్టు చుర చురా ఆమె వంక చూసింది భాగ్యం. 'ఎంత చదువుకుంటేనేం—ఎంత సంపద వుంటేనేం —లేకి బుద్ధులు పోకపొయ్యాక...!' బిగ్గరగానే సణిగింది భాగ్యం.

ఎవరినంటూన్నదో, ఎందుకంటూన్నదో తెలియక అయోమయంగా చూస్తోంది శ్రీదేవి.

'నిన్న చెట్టు నిండుగావున్న మొగ్గలు తెల్లారేసరికి ఒక్కటి లేకుండా మాయం చేశారు దొంగమూక!' కసిగా పళ్ళు కొరుకుతోంది భాగ్యం.

'అడిగితే ఒక్క పువ్వల్లా విదుపుతావు .. అందుకని ఇట్లా చాటుగా కోసుకుపోయి అన్నీ దక్కించుకున్నారే లక్కా!' భాగ్యం భగ భగ మండే మంట అయితే రత్న మెప్పుడూ ఆ అగ్నిలో అభిషేకించే ఆజ్యమే.

'పువ్వులు లేవా రత్నం? ఏమయ్యాయ్?' విస్మయంగా అడిగింది శ్రీదేవి.

'ఆవేమో మరి—మీ ఇంటి ముందున్న మొక్కలు; పూలేమయ్యాయో మీరే చెప్పాలి.' ఆ నిష్ఠూరంలో నేరం తన మీదే మోపడం స్పష్టంగా అర్థమయింది శ్రీదేవికి.

నొసలు చిట్లించి, 'అనాలని అనుకున్నదేదో సూటిగానే అనెయ్యరాదూ? అయితే నేను కోశానంటారా ఆ పువ్వుల్ని.' అన్నది కాస్త కరుగ్గానే.

'ఉన్న మాటంటే ఉలుకెక్కువట. రాత్రిళ్ళు గేటుకి తాళం వేస్తాము; పరాయి వాళ్ళెవరూ ఎటూ పెరట్లోకి అడుగు పెట్టే ఆస్కారం లేదు; మా పూలు మేము చాటుగా కోసుకోవాలిసిన అగత్యం లేదు

కదా ? మరి ఏవరా కక్కుర్తి పని చేశారో మీరే చెప్పండి.'

కల్లో కూడా భావించని ఒక నీచప్పని శ్రీదేవికి అంటగట్టి ఆమెలో కల్లోలం లేవదీసిన భాగ్యం చెల్లెలుతోసహా నిష్క్రమించింది.

నిశ్చేష్టురాలై నిలబడిపోయింది శ్రీదేవి. విషపుకాటు తిన్న మోస్తరు అణువణువునా ఆమె శరీరం వేదనకు లోనయింది. ఆ బాధలో ఆమె సహజ శాంతస్వభావం మరుగున పడిపోయింది. చర్రున వెనక్కి తిరిగి భర్త దగ్గరకు వచ్చింది.

రవి ఈ గడబిడంతా మొదటినించీ వింటూనే ఉన్నాడు. పాపం అతని స్థితి అడకత్తెరలో నలిగే పోకలా ఉన్నది. సముద్రంలో వాయుగుండాల్లా ఒకటి తరవాత ఒకటి పుట్టుకొస్తున్న ఈ తగాయిదాలు చూస్తూంటె మతి పోతూందతనికి.

వాకిట్లో జరిగే జగడం మీద చెవుల్ని, బాత్‌రూమ్‌లో స్నానం చేస్తూన్న శేఖరం మీద కళ్ళనీ లగ్నంచేసి వున్నాడతను.

సరిగ్గా శేఖరం బాత్‌రూమ్‌లోనించి ఊడిపడేవేళకు, శ్రీదేవి ముక్కుపుటాలూ కళ్ళూ ఎరుపు చేసుకుని ఆవేశం వంటిని ఆకులా వణికిస్తూంటే, కంఠం రుద్ధమయి పోగా, 'ఈ కొంపలో ఒక్క క్షణం ముండను గాక వుండను. ఇల్లు మారుస్తారా లేకపోతే మా యింటికి పొమ్మంటారా నన్ను?' అని రవిని నిగ్గదీసి అడుగుతోంది.

ఇంతలోనే శేఖరం రావటాన్ని చూసి తాత్కాలికంగా ఉద్రేకం అణుచుకున్నది. ఎంత మోటబారినా ఎంత రాటుదేరినా, ఇంకా అతిధుల ముందు కూడా తన నోటి సత్తువా, భాషా పటిమా ప్రదర్శించుకునేటంత అధమస్థితికి దిగజారలేదామె.

భార్య నిగ్రహశక్తికి రవికూడా లోలోన జోహార్లర్పించాడు.

శేఖరం ఈ గొడవసలు గమనించినట్టే లేదు. ఒకవేళ గమనించినా ఆలుమగలు నడుమ అర్థంమీద ఆవగింజలా దొర్లిపొయ్యే చిలిపి కయ్యమనుకొని ఉండవచ్చు.

* * *

ఎలాగయితేనేం సమయానికే బస్సు అందుకున్నారు ముగ్గురూనూ.

అనుకున్నంత అపురూపంగా లేదు కొల్లేటి సరస్సు. సాధారణంగా అగుపించే నీటి కొంగలు. తప్పించి, ఎక్కడెక్కడి నించో వలసవచ్చి వాలాయని విడ్డూరంగా చెప్పుకునే దేశదేశాల పక్షిగణాలు లేనే లేవక్కడ, బహుశ సీజన్ కాకపోటంవల్ల గావచ్చు. కొల్లేటినిండా దట్టంగా తుంగ మాత్రం ఉన్నది. నాటు బోటులో పడవ షికారుచేసి, పెద్దింటమ్మను దర్శించుకున్నారు.

ఎండ నడినెత్తిని మాడుస్తోంది. హుషారు హరించి నీరసం ఆవరించింది ముగ్గురికీ. పెద్దచెట్టు ఒకటి చూసుకొని దానినీడలో జంపఖానా పరిచి విశ్రాంతి తీసుకున్నారు.

చెట్టుబోదెకు ఆనుకు కూర్చుని రుమాలుతో విసురుకుంటూ చెమట ఆర్పుకుంటున్నాడు రవి. బూట్లూ సాక్సూ విప్పి కొంత బరువునుంచి విముక్తుడయ్యే ప్రయత్నంలో ఉన్నాడు శేఖరం. వాటర్ బేగ్‌లో నీళ్ళు గ్లాసుల్లోపోసి, చక్కెరా నిమ్మరసమూ చేర్చి షర్‌బత్ తయారు చేస్తోంది శ్రీదేవి.

శ్రీదేవి వదనం అతి నిర్లిప్తంగా ఉన్నది. పొద్దుటి సంఘటన తాలూకు గాంభీర్యం ఆమె నింకా విడవలేదు. పైగా ఆశించినంతగా వినోదం లభ్యం కాకనో, లేదూ ఆమె అంతర్యం ఆ ఆనందానికి అభిముఖంగా లేకపోవటం వల్లనో ఈ ప్రయాణమామెకు నిరుత్సాహం కలిగించింది.

ఉదాసీనంగా ఉన్న భార్యనుచూసి, నిశ్శబ్దాన్ని చీలుస్తూ, 'కొన్నింటిని గురించి మనం అతిశయోక్తులతో వింటాం. వాటికి మన శక్త్యనుసారం అలంకారాలు జోడించి గొప్పగా ఊహించుకుంటాం. అవి వాటి నిజస్వరూపాలతో సాక్షాత్కరించి నప్పుడు మన వూహామూర్తులకు పూర్తి వ్యతిరేకంగా ఉన్న వాటిని చూసి స్తబ్ధులమే అవుతాం, దీనికి గట్టి తార్కాణం ఈ కొల్లేటి సరస్సే, దీన్నిగూర్చి ఎన్ని విశేషాలో విన్నాను — చూస్తే దాన్లో సహస్రాంశమయినా కనిపించడం లేదు.' అన్నాడు రవి.

'కరెక్ట్! నీ వాదనతో మేము ఏకగ్రీవంగా ఏకీభవిస్తున్నాం! నేను కనిపెట్టిన మరో నగ్న సత్యాన్ని కూడా వినుమరి. అందాలు చిందే నాట్య మయూరిని చూసి అది రమ్యగీతాన్ని కూడా ఆలాపించ గలదని ఊహించటమెంత పొరపాటో, బాహ్య రూపాన్ని చూసి అంతరాకృతిని అంచనా వెయ్యటం ఎండమావిలో నీరు లభిస్తుందని ఆశపడ్డం వంటిదని అనుభవ మయింది నాకు.'

గతుక్కుమన్నాడు రవి; శ్రీదేవి కయితే మొహం జేవురించింది.

'భేష్ ఎవరిని రిసెర్చిచేసి తేల్చుకున్నావ్ ఈ పచ్చినిజాన్ని.' తెచ్చి పెట్టుకున్న నవ్వుతో



# స్వయంకృతం

ప్రశ్నించాడు రవి.

శేఖరం రవికేసి సాలోచనగా చూశాడు. 'సారీరా రవీ—! నువ్వు రికమెండ్ చేసిన అమ్మాయిని వివాహమాడలేను.' నెమ్మదిగానే అయినా, తన అయిష్టాన్ని స్పష్టంగా వ్యక్తపరిచే డతను.

ఒక్కసారిగా ఎండ తీక్షణత ఎక్కువయినట్టుగా అయింది రవికి. శ్రీదేవి కింకా ఆ సంభాషణలోని సారాంశం బోధపడనే లేదు.

'ఏం—ఎందుకని?' పెదాలు తడుపుకుంటూ అడిగాడు రవి.

'అదే చెప్పబోతున్నాను. చూసీ చూడంగానే నన్నామె ఆకర్షించిన మాట వాస్తవమే. పెళ్ళిచూపులు అనంగానే ఆ కాస్మెటిక్ 'ప్రిన్సె'గా తయారయి కళ్ళు చెదిరేలా కనబడ్డం, మామూలు సమయాల్లో మాత్రం జిడ్డోడుతూ నీరసం పార్టీలని తలపింపచేసే మనుషులంటే నాకు ముందు నించీ ఏవగింపే.

భాగ్యం అలా కాకుండా నేను చూస్తానని తెలియకపోయినా చక్కగా ముస్తాబయి వుంది. దానితో నాకా అమ్మాయి పైన మంచి అభిప్రాయం ఏర్పడింది కలిగిన వాళ్ళు కాదు గాబట్టి నెమ్మదస్తురాలయి వుంటుందనీ, అక్కచెల్లెళ్ళూ అన్నదమ్ములూ ఉన్న పెద్దకుటుంబంలో పిల్ల అవటంచేత నలుగురు ఉన్న ఇంట్లో ఎలా మసలాలో తెలిసిన ఒద్దికా వందనం గల బుద్ధిమంతురాలనీ, వారి తొలిసంతానమూ చిన్నతనాన్ని దాటేసిన వయస్సూ కాబట్టి కొంత బరువూ బాధ్యతా తెలిసి వుంటాయనీ అనుకొని చాలా సంతృప్తి పడ్డాను నేను.' ఆగాడు శేఖరం.

శ్రీదేవి ఇద్దరికీ షర్బత్ గ్లాసు లందించింది. గ్లాసందుకుంటూ కలాసాగా నవ్వాడు రవి 'ఏం దూరదృష్టిరా నాన్నా నీది...! ఏ పెళ్ళికొడుకయినా పిల్లకాయ అందచందం చూస్తాడు; చదువో సంగీతమో కోరతాడు; మ్యాటరు వెనక ఎక్కించుకు తిప్పేందుకు తగిన నాజూకు నాగరికతా ఉన్నదా అని ఆలోచిస్తాడు. అంతేకానీ అమ్మమ్మా నాయనమ్మల్లాగ... నమ్రతో విశయమూ వందనమూ అంటావేమిటి' పరిహాసంగా నవ్వేశాడు రవి.

శేఖరం నవ్వలేదు. 'నువ్వన్నట్టు ఇన్ని ముందాలోచనలు చేసినందుకు గూడా కారణమున్నది. మా కుటుంబం కూడా పెద్దది. పెళ్ళి కావలసిన చెల్లెళ్ళూ, పెళ్ళయి పుట్టింటికి రాకాపోకా సాగించే అక్కలూ ఉన్నారు. ఇంకా కాలు నిలతొక్కుకోవలసిన తమ్ముళ్ళున్నారు. ఆర్థికంగా నా అవసరం వారి కవసరం లేకపోవచ్చు. కానీ నాన్నగారు పెద్ద వారయ్యారు; అమ్మకూడా ఈ సంసార సాగరాన్ని ఈదీ ఈదీ అలిసిపోయి వున్నది. శారీరకంగానూ, మానసికంగానూ కూడా వారికిక కొంత విశ్రాంతి అవసరం. నాన్నగారు ఈ ఏడాది రిటైరయిన తరువాత పాలు కిప్పించేసి మావాళ్ళందరినీ నా దగ్గరే ఉంచుకోవాలని నా ఆకాంక్ష. సంసార తాపత్రయాలని వారితో పాటు పంచుకోవటం ఇంటికి పెద్దకొడుకుగా అది నా కర్తవ్యం నా ఉద్దేశ్యాలను మన్నించి, నా విధి నిర్వహణలో చేదోడు వాదోడయ్యే అసలు సిసలు సహధర్మచారిణి కావాలి నాకు.' గంభీరంగా అన్నాడు శేఖరం.

ఖాళీ గ్లాసు క్రింద పెడుతూ, 'ఇప్పుడు మటుకూ ఏమయిందీ ... ? నువ్వను కున్నట్టు పనీపాట తెలిసిన పిల్లేనే...మంచి గుణం—' బెరుకు బెరుగ్గానే సమర్థించబోయి, కళ్ళు కొనలనించి హేళనగా నవ్వుతోన్న శేఖరాన్ని చూసి ఆపేసాడు రవి.

'వెయ్యి అబద్ధాలాడయినా పెళ్ళి చెయ్యమన్న సామెత సార్థకం చెయ్యదలుచుకున్నావా స్వామీ? నామీద నీ ప్రయోగం పని చెయ్యదు. కళ్ళారాచూసి ఓ నిశ్చయాని కొచ్చినవాణ్ణి నేను. నా కన్ను కప్పాలని చూడకు.'

దెబ్బతిన్నట్టు చూశాడు రవి. నెగంబడి అర్థమయిన శ్రీదేవి భర్త అవస్థకు ఎగతాళిగా నవ్వింది.

'రెండు రోజుల్లో ఏం చూసి కని పెట్టావోయ్ ఆ అమ్మాయి అవగుణాల్ని? వంతాని? పౌరుషంగా అడిగాడు రవి.

పంపుదగ్గర కీచులాటగానీ గులాబి పువ్వుల రాద్ధాంతంగానీ శేఖరం విని వుండడని రవికి రూఢిగా తెలుసు.

'రెండు రోజులుగాదు రెండు గంటలు చాలు కొంతమంది బుద్ధుల్ని లెక్క గట్టడానికి!' సవాల్ చేసినట్టన్నాడు శేఖరం. 'నిన్న చీర చిరిగిపోయిందని గగ్గోలు పెట్టావ్ జ్ఞాపకముందా చెల్లాయ్—?' శ్రీదేవి వంక తిరుగుతూ అన్నాడు.

మధ్యలో ఎందుకీ అతకని ప్రసంగమనుకుంటూనే, 'మరే — సరికొత్త ఫారిన్ నైలెక్స్ చీర. మొన్నరాత్రి సెకండ్ షో సినిమాకు వెళ్ళినప్పుడు కట్టుకున్నానది. పిన్ని చెమట ఆరుతుంది కదా అని డాబా మీద ఆరేసాను మడత పెట్టేటప్పుడు చూద్దునుకదా—పెద్ద చిరుగు. ఏ కుర్చీకో కొట్టేసి వుంటుంది.' విచారం దోబూచులాడింది శ్రీదేవి మొహం మీద.

సావకాశంగా దువ్వెటిమీద ఒరుగుతూ, 'మేకాకాదూ మాదీకాదు; ఆ పనిచేసింది భాగ్యం.'

'చావుకబురు చల్లగా' అన్నట్టు తాపీగా

## నేటి శతకము

శ్రీ ఇందిర దయచేతను
నా రూఢిగ సకల జనులు హౌరా యనగా
ధారాళమైన నీతుల
చెప్పలారగ మీకు నేను తెల్పెద సుమతీ!

అక్కరకు రాదు చుట్టము
మొక్కిన వర మిడు వేల్పు నిలలో
నెప్పుడున్
యెక్కడను లేదు న్యాయము
గ్రక్కున ఇది తెలిసి నీవు మనవలె
సుమతీ!

అప్పిచ్చు వాడు వున్నను
తప్పిచ్చుట అసలు వడ్డీ అతికష్టంబౌ
అప్పులకు పోకు మెన్నడు
అప్పడిగెడి వాని దరికి చేర్పకు సుమతీ!

తెలివున్న నేమి లాభము
కలుగదు నీ కార్యసిద్ధి తత్తరితమునన్
కలిగున్న చాలు డబ్బును
బలవలమని రాల్చు శక్తి భువిలో సుమతీ!

మాటకు ప్రాణ మసత్యము
చీటికి ప్రాణంబు దాని రచయిత
స్టేటస్
బోటికి ప్రాణము అందము
భూమికి ప్రాణంబు ధనము కలిలో
సుమతీ!

— ధూర్జటి వాసంతి

అన్నాడు శేఖరం.

తుళ్ళిపడ్డారు రవీ, శ్రీదేవీ. 'నిజమా?' అన్నారు ఒకేసారి.

'నిన్న మధ్యాహ్నం నా హోల్డాలు కూడా ఎండలో వేద్దామని డాబా మీదకు వెళ్ళాను. నాలుగు మెట్లు దిగువున ఉండగానే 'ప్ర్రరు' మన్న చప్పుడు వినిపించింది, పైకి వెళ్ళేసరికి భాగ్యం చేతిలో ఉన్నది చీర. నన్నుచూసి వెలా తెలా పోయి చీర క్రిందపడేసి సరసరా మెట్లు దిగిపోయింది. ఈ బుద్ధి తక్కువ చర్యే ఆ అమ్మాయి ఓర్వలేని తనాన్ని నాకు పట్టి యిచ్చింది.

'నిజమే?' నమ్మలేక పోతున్నాడు రవి.

పకపక నవ్వాడు శేఖరం. అప్పుడే ఏముంది. మిగతాదికూడా విను. ఆ అమ్మాయి సకల దుర్గుణాభిరామ అనటానికి నిదర్శనంగా మరో ఉదాహరణ ఇస్తాను.

ఈ ప్రయాణం సందట్లో మునిగి చెల్లాయి పువ్వుల సంగతే మర్చిపోయిందిగానీ, ఇన్నాళ్ళ చెట్టునిండా పూశాయి గులాబీలు. భాగ్యం చీకటితో వచ్చి దొంగతనంగా అవన్నీ కోసుకుపోయింది తెలుసా!'

'ఆ...?' నోరావలించేసింది శ్రీదేవి. నిర్వాక్కుడయ్యాడు రవి.

'దొంగతనంగా' అని ఖరాఖండీగా ఎందుకు చెబుతున్నానంటే, నాకు తెలతెలవారుతూండగానే బెడ్‌కాఫీ తాగే అలవాటుంది. ఆవేళకు మెలుకువ వచ్చింది. మీరింకా నిద్రలోనే ఉన్నారు. మిమ్మల్ని లేపడం ఇష్టంలేక సిగరెట్టన్నా కాల్చుకుందామని వరండాలోకి వచ్చాను. నేను బయటకు రావటం చూసి భాగ్యం పువ్వులు కోస్తున్నదల్లా చటుక్కున మల్లెపొద చాటున నక్కింది. ఆమెను చిక్కున పెట్టడం ఇష్టంలేక నేనే లోపలికి తప్పుకున్నాను.'

విస్తుపోయి వింటున్నారిద్దరూ.

'తనకు లేదనే అక్కసుతో పరాయి వాళ్ళ చీరని చింపిన మనిషి నా అక్కాచెల్లెళ్ళనూ, తల్లితండ్రుల్నీ ఆదరిస్తుందని ఎలా నమ్మను? పువ్వులకంటే అతి చిన్నకోరికకు లొంగి దొంగతనం చేయటానికే సాహసించిన అమ్మాయి నా ఇంటికి గౌరవం తెచ్చేలా ప్రవర్తిస్తుందని ఎలా సరిపెట్టుకోను?

లాభంలేదురా రవీ! తెలిసీ గోతిలోకి దిగలేను!' నిశ్చలంగా, స్థిరంగా అన్నాడు శేఖరం.

ఆ మొక్కలు వాళ్ళవేసనీ, వాళ్ళ పువ్వులు వాళ్ళు కోసుకున్నారనీ చెబుదామని పెదాలదాకా వచ్చిన మాటల్ని ఉపసంహరించుకున్నాడు రవి.

'భాగ్యాన్ని సమర్థించటం కోసం ఉన్న సంగతి చెబితే, 'వాళ్ళ మొక్కలెలా అయ్యాయి?' 'వాళ్ళవే అయితే అంత చాటుమాటుగా కోసుకోవలసిన ఖర్మేమిటి?' ఈ ప్రశ్నలన్నీ వెనకెనకే తలెత్తుతాయి. వాటన్నింటికీ సమాధానాలు చెప్పుకుంటూపోతే, 'సూదికోసం సోదికి పోతే...' అన్నట్టు తను దాయాలనుకొంటున్న ఆ పిల్ల గుణాలన్నీ బయటపడనే పడతాయి.' రవి మౌనంగా ఉండిపోయాడు.

పిడికిలి విప్పినట్టు శేఖరం రహస్యం ఛేదించే సరికి శ్రీదేవికి మబ్బుతెర తొలగినట్టయింది. 'ఒక్కపువ్వు ఇవ్వలేదని భాగ్యం ఇంత కూడనిపనికి పూనుకున్నది...?' అని ఆశ్చర్యపోయింది.

'కోసుకున్నది చాలక ఆ దొంగతనం శ్రీదేవిమీదికి నెట్టిందని తెలిస్తే ఇంకెంత అసహ్యించుకుంటాడో! అసలా అమ్మాయికున్న వికారాలన్నీ వివరిస్తే ఇక తనని మిత్రద్రోహిగా ఎంచుతాడు కూడానూ.' రవి పశ్చాత్తాప పడ్డాడు.

ఓడిపోయినట్టు మొహం వేలాడేసిన భర్తను చూసి, 'మీకే శాస్తి జరగాలిసిందే' అన్నట్టు మొహం పెట్టింది శ్రీదేవి.

* *

ఆ రాత్రి 'జనతా'కే శేఖరం వెళ్ళిపోయాడు.

మర్నాడు రవి చేతిలోంచి పేపరంది పుచ్చుకుంటూ, 'ఏదో శుభవార్త చెబుతానంటిరే...' అడిగాడు వెంకటామయ్య.

'అబ్బే మరేం లేదులెండి. మేమీ ఇల్లు మార్చేస్తున్నాం. ఆ సంగతి చెబుదామని...' ఎటో చూస్తూ నవ్వాడు రవి.

వాళ్ళు ఇల్లు మారటం తనకెలాగ శుభవార్త అవుతుందో అర్థంకాక బుర్ర తడుముకుంటూ వెళ్ళిపోయాడు; పాపం వెంకటామయ్య.

(అయిపోయింది)

